సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం, 16, ఏప్రిల్, 2025



చీనీ టన్ను రూ.22,560

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.22,560, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



ఆర్టీసీ ఉద్యోగుల్లో అభద్రత

ఆర్టీసీ ఉద్యోగుల్లో అభద్రతా భావం నెలకొంది. జగన్ సర్కార్ ఇచ్చిన 1-2019 సర్క్యులర్‌ను కూటమి సర్కార్ అటకెక్కించగా.. ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందోనన్న భయం వెంటాడుతోంది.

8లో

గరిష్ఠం/కనిష్ఠం

41.1°/20.7°

జిల్లాలో మంగళవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడి భగభగలతో జనం అల్లాడిపోతున్నారు. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు

- విలేకరుల సమావేశంలో డీఎస్పీ మహేష్



మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

చిలమత్తూరు: ఎవరైనా సరే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మహేష్ హెచ్చరించారు. మంగళవారం ఆయన హిందూపురం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మోహన్ అనే వ్యక్తి ఈ నెల 8వ తేదీన తన స్వగ్రామమైన చెన్నే కొత్తపల్లి మండలంలో జరుగుతున్న జాతరకు వెళ్లి అక్కడ మద్యం సేవించి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. దీంతో 11వ తేదీన వైఎస్సార్ సీపీకి చెందిన సురేష్ మరో నలుగురు వ్యక్తులు మోహన్‌పై దాడి చేశారన్నారు. బీరు బాటిళ్లతో మోహన్ తలపై కొట్టి ఈ దాడి ఘటనను వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో 12వ తేదీన మాజీ సీఎం జగన్‌పై అనుచిత వాఖ్యలు చేసిన మోహన్‌పై 356(2), 352, 353(2) బీఎన్ఎస్ సెక్షన్‌తో పాటుగా ఐటీ యాక్ట్ సెక్షన్ 66 నమోదు చేసి రిమాండ్‌కు పంపామని డీఎస్పీ తెలిపారు. అదే విధంగా మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేష్, మరో నలుగురిపై 189(2), 109 రెడ్ విత్ 190 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే 12వ తేదీ రాత్రి బోయ లోకేష్, నవీన్ మరికొంత మంది రాడ్‌లు తీసుకుని ముద్దిరెడ్డి పల్లిలోని మోహన్ బంధువుల ఇంట్లోకి వెళ్లి బెదిరించారన్నారు. లోకేష్‌పై అప్పటికే రౌడీషీట్‌తో పాటు పలు కేసులు ఉన్నందున అరెస్ట్ చేశామన్నారు. ఇందులో ఎలాంటి పక్షపాతం చూపలేదన్నారు. ప్రజలు, రాజకీయ నేతలు సోషల్ మీడియా వేదికగా వచ్చే వాటిని పట్టించుకోవద్దని, ఎవరైనా తప్పు చేస్తే పోలీసులకు తెలియచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

9 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: వాతావరణ మార్పులతో మంగళవారం తెల్లవారుజామున జిల్లాలోని 9 మండలాల పరిధిలో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా అమడగూరు మండలంలో 21.2 మి.మీ, ముదిగుబ్బలో 15.6 మి.మీ వర్షం కురిసిందన్నారు. అలాగే ఓడీసీలో 4.2 మి.మీ, కనగానపల్లి 3.2, చిలమత్తూరు 3.0, గాండ్లపెంట 2.4, బత్తలపల్లి 2.2, కదిరి 2.0, తాడిమర్రి మండలంలో 1.2 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

- అనంతపురం నగరానికి చెందిన రంగనాథ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వయసు 32 ఏళ్లు. మూడేళ్ల క్రితం పెళ్లయింది. ఎందుకో అనుమానమొచ్చి ఇటీవల ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోగా షుగర్ ఉన్నట్లు తేలింది. దీంతో ఒక్కసారిగా అతను ఖిన్నుడయ్యాడు.
- నగరానికి చెందిన మటన్ వ్యాపారి గౌస్‌మొహిద్దీన్‌కు 37 ఏళ్లు కూడా లేవు. ఇద్దరు పిల్లలున్నారు. సరైన వ్యాయామం లేక ఒత్తిడికి గురై బీపీ, షుగర్ రెండూ వచ్చాయి. ఇటీవల సరిగా నిద్రపట్టడం లేదని బాధితుడు వాపోతున్నాడు. వీరే కాదు.. ఉమ్మడి జిల్లాలో మధుమేహం, రక్తపోటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

కలవరపెడుతున్న మధుమేహం



- ఉమ్మడి అనంతలో చాపకింద నీరులా విస్తరిస్తున్న షుగర్ వ్యాధి
- 22 శాతానికి పైగా బాధితులు
- వందలో 28 మందికి రక్తపోటు
- అవగాహన లేక గ్రామీణులూ బాధితులవుతున్న వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మధుమేహ జబ్బు చాపకింద నీరులా విస్తరిస్తోంది. జనాభా పెరుగుదల రేటుతో పోల్చి చూస్తే డయాబెటిక్ బారిన పడుతున్న వారే ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. యువకులు సైతం జీవనశైలి జబ్బుల బారిన పడుతుండటం ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో 40 ఏళ్లు నిండిన వారిలో ఎక్కువగా ఆయా జబ్బుల బారిన పడేవారు. కానీ, ఇటీవల 30 ఏళ్లు దాటని వారూ వీటి కోరల్లో చిక్కుతున్నారు. ఈ విషయం వైద్యులను కూడా విస్మయానికి గురి చేస్తోంది.

గ్రామీణులూ బాధితులే..

మధుమేహం, రక్తపోటు తదితర జబ్బులతో బాధపడే వారు ఒకప్పుడు పట్టణాలు, నగరాల్లోనే ఎక్కువగా ఉండేవారు. పని ఒత్తిడితో సతమతమవడం కారణంగా వీటి బారిన పడేవారు. కానీ, ఇప్పుడు ఆయా రోగాలు పల్లెలకూ విస్తరించడం గమనార్హం. ఈ క్రమంలోనే డయాబెటిక్, బీపీ మందుల ధరలు పెరగడం సామాన్యులకు కొరకరాని కొయ్యగా మారింది.

అవగాహన లేకే..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) బాధితులు 27 శాతం పైగానే ఉన్నట్టు తేలింది. పట్టణాల్లో అయితే ఇది 30 నుంచి 32 శాతం కూడా ఉన్నట్టు తాజా సర్వేలో వెల్లడైంది. ఇక.. షుగర్, హైపర్‌టెన్షన్ జబ్బులు నియంత్రణలో లేనివారు ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలో శరీరంలో ఇతర అవయవాలపై ప్రభావం పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జబ్బుల నియంత్రణపై అవగాహన లేకపోవడం అనర్థాలకు దారి తీస్తోంది.

సమస్యలెన్నో..

- షుగర్ నియంత్రణలో లేకుంటే కిడ్నీ సమస్యలు తలెత్తుతాయి.
- కంటిచూపుపై దుష్ప్రభావం పడుతుంది.
- శరీరంలో గాయాలైనప్పుడు మానడం చాలా కష్టం.
- మధుమేహం అదుపులో లేకపోతే గుండె జబ్బులొచ్చే అవకాశాలు ఎక్కువ.
- అధిక రక్తపోటు వల్ల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది.
- నరాల వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుంది.

ఉమ్మడి జిల్లాలో వివరాలిలా..

కేటగిరీ	శాతం
మధుమేహ బాధితులు	22.7
హైపర్ టెన్షన బాధితులు	27.4
రెండు జబ్బులతో ఉన్నవారు	19.1
ఉమ్మడి జిల్లా జనాభా	41,15,783
30 ఏళ్లు పైబడిన వారు	20,19,938
డయాబెటిక్ బాధితులు	4,64,585
హైపర్ టెన్షన్ బాధితులు	5,45,383
మందుల షాపులు	2,250
షుగర్, బీపీ మందుల విక్రయ వాటా	31 శాతం

అలవాట్లు మార్చుకోవాలి



మధుమేహం, హైపర్ టెన్షన్ ఉన్న వారు జాగ్రత్తలు తీసుకోవాలి. బాధితులు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా లేని ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఆరోగ్యానికి మేలు. పొగ తాగడం చాలా ప్రమాదకరం.

–డా.సుధాకర్‌రెడ్డి, గుండె వైద్య నిపుణులు

అక్రమ కేసులతో భయపెట్టలేరు

- వేణురెడ్డిపై పోలీసులది ముమ్మాటికీ కక్ష సాధింపే
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్

పెనుకొండ రూరల్: అక్రమ కేసులు బనాయించినంత మాత్రాన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. పోలీసులు ఎంతగా వేధించినా వెనక్కుతగ్గేది లేదని, ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటామన్నారు. మంగళవారం ఆమె పెనుకొండలో విలేకరులతో మాట్లాడారు. హిందూపురం పోలీసులు ఇద్దరు వైఎస్సార్ సీపీ కార్యకర్తల చేతులకు బేడీలు వేసి ఉగ్రవాదుల్లా రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకువెళ్లడం దుర్మార్గమన్నారు. దీనిపై ప్రశ్నించినందుకే గుడ్డంపల్లి వేణురెడ్డిపై పోలీసులు కక్షగట్టారన్నారు. శాంతియుత నిరసన తెలియజేసే హక్కునూ కాలరాస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని కూటమి పార్టీల నేతలతో పాటు పోలీసులూ గమనించాలన్నారు. చట్ట ప్రకారం నడుచుకోకపోతే భవిష్యత్‌లో తప్పక మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్ సీపీ శ్రేణుల గొంతు నొక్కలేరని గుర్తుంచుకోవాలన్నారు.

జిల్లాకు వర్షసూచన

బుక్కరాయసముద్రం: ఉమ్మడి జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 40.2 నుంచి 41.3 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

సాయి సహస్రనామ హారం ప్రారంభం



భక్తిగీతాలు ఆలపిస్తున్న భజన బృందం

ప్రశాంతి నిలయం: సత్యసాయి శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో 'సాయి సహస్రనామ హారం-ప్రేమామృత సారం' కార్యక్రమం ప్రారంభమైంది. సహస్రనామ హారంలో భాగంగా 1,008 సత్యసాయి నామాలతో భక్తిగీతాలను ఆలపించనున్నారు. వారం రోజుల పాటు సాగే కార్యక్రమంలో 21 భజన బృందాలు, 900 మంది సంగీత కారులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి ప్రారంభించారు. అనంతరం భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ భక్తి గీతాలను ఆలపించారు.

చంద్రప్రభపై చౌడేశ్వరీదేవి



చంద్రప్రభపై దర్శనమిస్తున్న చౌడేశ్వరీదేవి



ఆకట్టుకున్న కళాకారుల నృత్యం

అమడగూరు: చౌడేశ్వరీ దేవి వార్షిక ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు మంగళవారం అమ్మవారు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అమడగూరుకు చెందిన బ్రాహ్మణ, శెట్టి బలిజ సంఘం సభ్యులు చంద్రప్రభ ఉత్సవాన్ని వైభవంగా జరిపించారు. అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. విశేష అలంకరణలో చంద్రప్రభపై కొలువుదీరిన అమ్మవారిని గ్రామమంతా ఊరేగించి గ్రామ నడిబొడ్డున ఉన్న ఉట్టి ఎదుట కొలువుదీర్చారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించి భజన చేశారు. కాగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు..

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారికి బోనాలు సమర్పించారు. చీకిరేవులపల్లి, గంగిరెడ్డిపల్లి, రెడ్డివారిపల్లి, బలకవారిపల్లి, అమడగూరు గ్రామాల్లో మహిళలు బోనాలు తీసుకువెళ్లి చౌడేశ్వరీ అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో పెద్దత్తున జంతుబలులను అర్పించారు. బంధుమిత్రులతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకుంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీజ్యోతి ఉత్సవం నిర్వహించనున్నారు.

నిరసనపై నిరంకుశం

- వైఎస్సార్ సీపీ శాంతియుత నిరసన ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- ఉదయమే నియోజకవర్గ నేత వేణురెడ్డి సహా పలువురి అరెస్ట్
- పరిగి పోలీసుస్టేషన్‌కు తరలింపు.. నోటీసులిచ్చి విడుదల చేసిన వైనం
- పోలీసు చర్యలను నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించిన నేతలు



హిందూపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి పోలీసుల తీరుపై నిరసన చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చిలమత్తూరు: నిరసన...ప్రజాస్వామ్యం పౌరులకు కల్పించిన హక్కు. ఈ ప్రాథమిక హక్కును హిందూపురం పోలీసులు హరించారు. అంబేడ్కర్ జయంతి రోజున వైఎస్సార్ సీపీ దళిత నాయకుడు అంబేడ్కర్ నవీన్, జిల్లా బూత్ కమిటీ కన్వీనర్ వాల్మీకి లోకేష్ చేతులకు బేడీలు వేసి సోమవారం హిందూపురంలో నడిరోడ్డుపై కాళ్లకు చెప్పుల్లేకుండా పోలీసులు ఊరేగించడాన్ని నిరసిస్తూ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి మంగళవారం శాంతియుత నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయమే హిందూపురంలో గుడ్డంపల్లి వేణురెడ్డి నివాసానికి వెళ్లిన పోలీసులు ఆయనతో పాటూ వైఎస్సార్ సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, హిందూపురం మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ ఆసిఫుల్లా, సీనియర్ లీడర్ శివశంకరరెడ్డిని అరెస్టు చేసి పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేతలు పరిగి పోలీస్ స్టేషన్ వద్దకు భారీగా చేరుకున్నారు. ఈక్రమంలో పోలీసులు మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత నోటీసులు ఇచ్చి వేణురెడ్డితో పాటు మిగిలిన ముగ్గురినీ విడుదల చేశారు. దీంతో పరిగి నుంచి హిందూపురం పార్టీ కార్యాలయం వరకూ వేణురెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వచ్చారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... అందరం కలిసికట్టుగా ఉంటే ఎవరూ ఏమీ చేయలేరన్నారు. పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

శాంతిర్యాలీని అడ్డుకోవడం దుర్మార్గం

వేణురెడ్డిని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుసుకున్న పలువురు వైఎస్సార్ సీపీ చిలమత్తూరు, హిందూపురం మండలాల నేతలు హిందూపురం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించి విగ్రహం వద్ద బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు పోలీసులు వైఎస్సార్ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకొని కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్ గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, రామ్మూర్తి, దళిత నాయకులు మూర్తి మాట్లాడుతూ... పోలీసులు శాంతియుత ర్యాలీని కూడా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. తమ పార్టీ కార్యకర్తలను ఉగ్రవాదుల్లా చేతులకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకువెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎల్లకాలమూ కూటమి ప్రభుత్వం ఉండబోదన్న విషయం గుర్తించుకోవాలని పోలీసులకు హితవు పలికారు. పోలీసులకు తాము సహకరిస్తూ ఆందోళన విరమిస్తున్నామని, పోలీసులు కూడా తమ పట్ల, తమ పార్టీ నేతలు, కార్యకర్తల పట్ల అన్యాయంగా ప్రవర్తించవద్దన్నారు. కాగా పోలీసులు అంబేడ్కర్ విగ్రహం వద్ద భారీగా మోహరించి వైఎస్సార్ సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మణేసముద్రం గిరీష్, మూర్తి, మింటు, కవితారెడ్డి, తేజ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ రాజగోపాల్ తీరుపై సర్వత్రా విమర్శలు

హిందూపురం ఒకటవ పట్టణ సీఐ రాజగోపాల్ వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన తన బాధ్యత మరచి టీడీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రౌడీషీట్లు ఉన్న టీడీపీ నేతలు స్టేషన్‌కు వెళితే కుర్చీలు వేసి కూర్చోబెడతారని, ఏ తప్పు చేయకున్నా ఇతర పార్టీ వారి పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో హిందూపురంలో పనిచేసిన ఆయన.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే టీడీపీ నేతల అండతో మళ్లీ హిందూపురానికి వచ్చారన్నారు. తాజాగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ ఆదేశాలు తూ.చ తప్పకుండా పాటిస్తూ వైఎస్సార్ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. సోమవారం లోకేష్, నవీన్‌లను వన్ టౌన్‌కు తీసుకురాగా, వారి బంధువులను స్టేషన్ బయటే నేలపై కూర్చోబెట్టడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన నియంతృత్వ పోకడలతో సామాన్య ప్రజలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



పరిగి పోలీస్‌స్టేషన్‌లో గుడ్డంపల్లి వేణురెడ్డి తదితరులు

పరిగి: పోలీసులు రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వైఎస్సార్ సీపీ హిందూపురం నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి కోరారు. అధికార కూటమి ప్రభుత్వం ట్రాప్‌లో పడొద్దన్నారు. మంగళవారం ఆయన పరిగి పోలీసు స్టేషన్ ఎదుట విలేకరులతో మాట్లాడారు. పోలీసులు తమ పార్టీకి చెందిన దళిత నాయకుడు, వాల్మీకి వర్గానికి చెందిన మరో నాయకుడిని తీవ్రవాదుల్లా చేతులకు బేడీలు వేసి తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ మంగళవారం శాంతియుత ర్యాలీకి పిలుపునిచ్చామన్నారు. అయితే పోలీసులు ఉదయమే తనతో పాటు మరో ముగ్గురు నేతలను అరెస్టు చేశారన్నారు. పోలీస్ వ్యవస్థపై తమకు గౌరవముందన్నారు. అందుకే వారికి ఎప్పుడూ సహకరిస్తామన్నారు. పోలీసులు కూడా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అందరినీ సమానంగా చూడాలన్నారు. ఎవరో చెప్పారని అక్రమ కేసులు బనాయించకుండా నిజానిజాల కోసం విచారణ జరపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా జడ్జికి ఘన సన్మానం



జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎస్పీ పి. జగదీష్

అనంతపురం: ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సేవలు ప్రశంసనీయమని అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. బదిలీపై వెళ్తున్న జడ్జి జి.శ్రీనివాస్‌ను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మార్గదర్శకంలో జిల్లా పోలీసు, న్యాయశాఖలు పరస్పర సహకారంతో బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేశాయన్నారు. కఠిన నేరాల్లో ముద్దాయిలకు కఠిన శిక్షలు వేయడాన్ని గుర్తు చేసుకున్నారు.

నేడు బీఎస్ఎన్ఎల్‌లో వినియోగదారుల సేవా శిబిరం

పుట్టపర్తి టౌన్: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) వినియోగదారుల సమస్యల పరిష్కార శిబిరం బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ డివిజనల్ ఇంజినీర్ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కస్టమర్ సర్వీస్ మాసంలో భాగంగా పుట్టపర్తిలోని ఎస్‌బీఐ రోడ్డులో ఉన్న బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ భవన్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నారు. మొబైల్ సిమ్ సేవలు, ఎఫ్‌టీటీహెచ్(ఫైబర్ ఇంటర్నెట్), ఇతర సేవలకు సంబంధించిన సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చు.

ఆర్టీసీ ఉద్యోగుల్లో అభద్రతా భావం

- చిన్న పాటి తప్పిదాలకే ఉద్యోగం నుంచి తొలగిస్తున్న కూటమి ప్రభుత్వం
- రోజూ భయపడుతూ విధులు నిర్వర్తించలేమంటున్న ఉద్యోగులు



ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కదిరి డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు (ఫైల్)

కదిరి అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగుల్లో అభద్రతా భావం నానాటికీ పెరిగిపోతోంది. 2019లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 1–2019 సర్క్యులర్ జారీ చేసి ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రతకు భరోసా కల్పించింది. అంతేకాక ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేస్తూ కార్మికులను ఉద్యోగులుగా పరిగణించింది. దీంతో ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం పెరిగి నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. ఫలితంగా సంస్థ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను అటకెక్కించింది. దీంతో తమ ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతోందని ఆర్టీసీ కార్మికులు వాపోతున్నారు. ఈ క్రమంలో తరచూ ఏదో ఒక డిపో పరిధిలో కార్మికులు నిరసన బావుటా ఎగురవేస్తూనే ఉన్నారు. దశలవారీ ఉద్యమ కార్యాచరణతో కదిరి డిపో పరిధిలోని నేషనల్ మజ్దూర్ యూనియన్ పోరుబాటకు సిద్ధమైంది. ఇప్పటికే రెండు సార్లు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. అలాగే మరో రెండు పర్యాయాలు గేట్ మీట్‌లతో ధర్నా నిర్వహించారు.

రోడ్డున పడనున్న కుటుంబాలు

జిల్లాలో వ్యాప్తంగా మొత్తం ఆరు డిపోల పరిధిలో ఆర్టీసీ, అద్దె బస్సులు రెండు కలిపి 410 వరకు ఉన్నాయి. ఈ ఆరు డిపోల్లో 1,600 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ అమలు కాకపోవడంతో ఇప్పటి వరకూ సుమారు 50 మంది డ్రైవర్లు, కండక్టర్లు సర్వీస్‌లో నుంచి రిమూవ్ అయినట్లు సమాచారం. ఇదే బాటలో మరికొందరు ఉద్యోగులను తొలగించేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఉద్యోగాలు కోల్పోయిన వారి కుటుంబాలు రోడ్డున పడనున్నాయి.

గత ప్రభుత్వంలో నో టెన్షన్

ఏపీఎస్ఆర్టీసీలో 1963లో ఏర్పాటు చేసుకున్న కాండక్ట్, క్లాసిఫికేషన్, అప్పీల్ మేరకు చిన్న చిన్న తప్పులకు సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు భారీ శిక్షలు వేసేవారు. ఎవరైనా టికెట్టు లేకుండా ప్రయాణిస్తున్నట్లుగా తనిఖీ అధికారి గుర్తిస్తే తక్షణమే కండక్టర్‌ను ఉద్యోగం నుంచి తొలగించేవారు. అలాగే తన ప్రమేయం లేకుండా ప్రమాదం చోటు చేసుకుంటే డ్రైవర్‌ను బాధ్యుడిని చేస్తూ విధుల నుంచి తొలగించేవారు. 2019 వరకూ ఈ నిరంకుశ ధోరణి కొనసాగుతూ వచ్చింది. రాష్ట్రంలో 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడగానే తొలుత ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేస్తూ, 52 వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే ఉద్దేశ్యంతో సంస్థలో పని చేస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, అసిస్టెంట్ మేనేజర్ ర్యాంక్ వరకు విధివిధానాలను రూపొందిస్తూ ఎన్ఎంయూ నాయకులతో అప్పటి మేనేజింగ్ డైరెక్టర్ సురేంద్రబాబు సంప్రదించి సర్కులర్ 1–19ని తీసుకువచ్చారు. దీంతో 2024 వరకు ఉద్యోగులు ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. తప్పు చేసి పట్టుబడిన కండక్టర్లు, డ్రైవర్లకు ఇంక్రిమెంట్లుతో కోతలు విధించడం తప్ప వారిని ఉద్యోగాల నుంచి తొలగించకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సర్కులర్ 1–19ని అటకెక్కించింది. ఫలితంగా కదిరి డిపోలో పనిచేస్తున్న ఓ కండక్టర్, డ్రైవర్ చిన్నపాటి తప్పిదానికి తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చింది. ఇది ఉద్యోగుల్లో అభద్రతా భావాన్ని పెంచింది.

ఉద్యోగ భద్రత కోసం పోరాడతాం



ఆర్టీసీలో విధులు నిర్వర్తించేందుకు ఉద్యోగులు చాలా భయపడతున్నారు. చిన్నపాటి తప్పిదాలకు సర్వీసు నుంచి తొలగిస్తూ ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఉద్యోగ భద్రతా సర్క్యులర్ అమలు చేసే వరకూ పోరాటాలు సాగిస్తాం.

– ఎస్‌వీ రమణ, నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కదిరి డిపో

మా పరిధిలో లేదు

ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1–19 అమలు అనేది మా పరిధిలోని అంశం కాదు. ఇది పెద్దవాళ్లు చూసుకుంటారు. దీనిపై నేను ఏమీ మాట్లాడకూడదు.

– మధుసూదన్, జిల్లా ప్రజారవాణా అధికారి

ధర్మవరం యువకుడికి జాతీయ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న వెంకటేష్

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణానికి చెందిన రజినీ ట్రస్ట్, రక్తబంధం ట్రస్ట్ వ్యవస్థాపకుడు కన్న వెంకటేష్‌కు జాతీయ ఉత్తమ సేవారత్న పురస్కారం దక్కింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా విజయవాడలోని సిద్ధార్థ కాలేజ్ ఆడిటోరియంలో జనసేవా సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు రాష్ట్రాల్లో నిస్వార్థంగా సమాజానికి సేవలు అందిస్తున్న సేవకులను గుర్తించి అవార్డులను అందించారు. ఇందులో కన్న వెంకటేష్ ఉన్నారు. విజయవాడ ఎమ్మెల్యే సుజనాచౌదరి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసులు చేతులమీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు.

17న విద్యా వైజ్ఞానిక యాత్ర



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఈఓ కృష్ణప్ప, తదితరులు

పుట్టపర్తి అర్బన్: విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న చేపట్టిన విద్యా వైజ్ఞానిక యాత్రలో పాల్గొని శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఈఓ కృష్ణప్ప పిలుపునిచ్చారు. యాత్రకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం తన కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది రామకృష్ణ, లాజరు, ఉపాధ్యాయులు ఇర్షాద్, వలి, సురేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. జిల్లాలో ఎంపికైన 120 మంది విద్యార్థులతో కలిసి ఈ నెల 16వ తేదీ రాత్రి మడకశిర, ధర్మవరం, కదిరి నుంచి ప్రత్యేక బస్‌లతో ఉపాధ్యాయులు బయలుదేరుతారన్నారు.17న శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం, కుప్పంలోని అగస్త్య ఫౌండేషన్‌ను సందర్శిస్తారన్నారు. విద్యార్థులు సమరూప దుస్తులు ధరించి రావాలన్నారు. అలాగే తల్లిదండ్రుల అంగీకార పత్రం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. బాలికలు మహిళా ఉపాధ్యాయుల సంరక్షణలో, బాలురు పురుష ఉపాధ్యాయుల సంరక్షణలో ఉంటారన్నారు.

కళ్లలో కారం చల్లి.. రాళ్లతో దాడి

ధర్మవరం అర్బన్: ద్విచక్ర వాహనం రుణం కంతులు సక్రమంగా కట్టాలని హితవు పలికినందుకు సొంత బావ, అక్క కారం పొడి చల్లి రాళ్లతో దాడి చేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మరంలోని కేతిరెడ్డి కాలనీ ఎల్2కు చెందిన దాసరి సురేష్ తన భార్య పేరుపై ద్విచక్ర వాహనాన్ని ఫైనాన్స్ కింద తీసి బావమరిది రామాంజనేయులు ఇచ్చాడు. అయితే రుణం కంతులు సక్రమంగా కట్టకపోవడంతో ఆ భారం సురేష్‌పై పడుతూ వచ్చింది. దీంతో సోమవారం రాత్రి రామాంజనేయులును సురేష్, ఆయన భార్య నిలదీశారు. దీంతో రామాంజనేయులు, ఆయన భార్య ఉష నేరుగా సురేష్ ఇంటి వద్దకెళ్లి గొడవపడ్డారు. కళ్లలో కారం పొడి చల్లి, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఫెయిల్ భయం.. విద్యార్థిని బలవన్మరణం



మృతురాలు వైష్ణవి

ధర్మవరం రూరల్: మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన సాకే కృష్ణయ్య కుమార్తె వైష్ణవి (15) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివిన వైష్ణవి ఇటీవల పరీక్షలు రాసి ఇంటికి చేరుకుంది. అయితే పరీక్షలు తాను సక్రమంగా రాయలేదని, ఫెయిల్ అవుతాననే భావనతో మానసికంగా కుదేలైంది. ముభావంగా ఉండడంతో తల్లిదండ్రులు అసలు విషయం తెలుసుకుని సర్దిచెప్పారు. ఫెయిల్ అయినా పర్వాలేదులే అంటూ ధైర్యం చెప్పారు. ఈ నేపథ్యంలో తీవ్ర మానసిక సంఘర్షణకు లోనైన వైష్ణవి... మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పు కొక్కికి తల్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పనిపై బయటకు వెళ్లిన తల్లిదండ్రులు మధ్యాహ్నం 1 గంట సమయంలో ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి స్థానికుల సాయంతో ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వైష్ణవి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై రూరల్ పీఎస్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

9, 10 తరగతుల సిలబస్ తగ్గించాలి



డీఈఓ కృష్ణప్పకు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

పుట్టపర్తి అర్బన్: తొమ్మిది, పదో తరగతుల సిలబస్‌ను తగ్గించాలంటూ డీఈఓ కృష్ణప్పకు జిల్లా ఆంగ్ల ఉపాధ్యాయుల ఫోరం తరపున నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 9, 10వ తరగతుల్లో ఒక్కో తరగతిలో 9 యూనిట్లు, అదనంగా సప్లిమెంటరీ, వర్క్ బుక్‌లు ఉన్నాయని, అధిక సిలబస్ కారణంగా పాఠ్యాంశాల బోధనకు ఉపాధ్యాయులు, అభ్యసనకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠ్యాంశాల్లోని అన్ని విషయాలను పూర్తి స్థాయిలో బోధించడానికి సమయం సరిపోవడం లేదన్నారు. ఒక్కో తరగతిలో 6 యూనిట్లు ఉండేలా సిలబస్ సవరించాలని కోరారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగభూషణ, రవిచంద్రారెడ్డి, వెంకట్రాముడు, రేష్మాభాను, రామమూర్తి, బాబు, ఎల్‌వీ రమణ, వాసు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మార్చురీ అటెండర్ ఆత్మహత్యాయత్నం

- మెడికల్ ఆఫీసర్ వేధింపులే కారణం?

గోరంట్ల: మెడికల్ ఆఫీసర్ వేధింపులు తాళలేక మార్చురీ అటెండర్ ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు... గోరంట్లలోని సామాజిక ఆరోగ్య కేంద్రం మార్చురీలో ఔట్ సోర్సింగ్ విధానంలో అటెండర్‌గా వివాహిత రాధ పనిచేస్తున్నారు. మార్చురీ విభాగానికి సంబంధించిన పరికరాలు, సిబ్బంది సరిగా లేకపోవడంతో అటెండర్ రాధను నర్సింగ్ అటెండర్‌గా పనిచేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ క్రమంలో పనితీరుపై వైద్యాధికారి, రాధ మధ్య తరచూ గొడవ పడేవారు. దీంతో రాధ సెలవులో వెళ్లింది. సోమవారం సెలవులు పూర్తి కావడంతో ఆమె విధులకు హాజరయ్యారు. దీంతో ఆమెను నైట్ డ్యూటీకి వేశారు. తనకు చిన్న వయసున్న కుమారుడు ఉన్నాడని, నైట్‌డ్యూటీ వద్దని డాక్టరును రాధ ప్రాధేయపడింది. అయినా డాక్టర్ స్పందించకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె మంగళవారం ఆస్పత్రిలోని మందులు మోతాదుకు మించి మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. అంతకు ముందు ఇదే అంశంపై డీఎం హెచ్‌ఓకు ఆమె ఫిర్యాదు చేసింది. దీనిపై డీసీహెచ్ఎస్ తిపేంద్రనాయక్ మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. మరో వైపు తనను బ్లాక్‌మెయిల్ చేయడానికి రాధ ఆత్మహత్యాయత్నం చేసిందంటూ పోలీసులకు డాక్టర్ వినోద్ కుమార్ ఫిర్యాదు చేశారు.

వ్యక్తి దుర్మరణం

గోరంట్ల: కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెనుకొండ మండలం గోనిపెంటకు చెందిన దూబేనాయక్ (50) గోరంట్ల మండలం మిషన్ తండాలోని బంధువులను పలకరించేందుకు మంగళవారం రాత్రి బస్సులో వచ్చాడు. మిషన్ తండా వద్ద బస్సు దిగి జాతీయ రహదారి దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో దూబేనాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

ధర్మవరం అర్బన్: స్థానిక గుట్టకిందపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థిని కనిపించడం లేదు. ఈ మేరకు ధర్మవరంలో రెండో పట్టణ పీఎస్ సీఐ రెడ్డప్ప మంగళవారం వెల్లడించారు. గుట్టకిందపల్లికి చెందిన విద్యార్థిని అనంతపురంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివింది. ఇటీవల పరీక్షలు రాసిన అనంతరం ఇంటికి చేరుకున్న ఆమె మంగళవారం మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు చెక్

- ఎస్పీ రత్న



సీసీ కెమెరాలను వితరణ చేసిన దాతలను సన్మానించిన ఎస్పీ రత్న, తదితరులు

మడకశిర: సీసీ కెమెరాల ఏర్పాటుతో అన్ని రకాల నేరాలకు చెక్ పెట్టవచ్చని ఎస్పీ వి.రత్న అన్నారు. నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. మడకశిరలో దాతల సహకారంతో 32 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మంగళవారం ఎస్పీ ప్రారంభించి, మాట్లాడారు. మడకశిర నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లు అన్నీ కర్ణాటక సరిహద్దులో ఉన్న నేపథ్యంలో సరిహద్దులో నేరాలను అదుపు చేయడానికి సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మడకశిర పట్టణంలో ముఖ్యమైన కూడళ్లు, విద్యాలయాలు, ప్రార్థనా మందిరాలు, జనసంచారమున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు దాతలను అభినందిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప, ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, సీఐలు నాగేష్, రాజ్‌కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన స్కేల్ ఆఫ్ రిలీఫ్



ఇటీవల ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి పంట

అనంతపురం అగ్రికల్చర్: వరదలు, ఈదురు గాలులు, వడగండ్ల వాన, అకాల వర్షాలు తదితర ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆస్తి, పంట నష్టం, అలాగే పశువులు, జీవాలు, కోళ్ల నష్టం తదితర వాటికి వర్తింపజేసే ఎక్స్‌గ్రేషియా (స్కేల్ ఆఫ్ రిలీఫ్) స్వల్పంగా పెంచుతూ రాష్ట్ర ప్రకృతి విపత్తుల విభాగం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డీఆర్ఎఫ్) నిబంధనల ప్రకారం ప్రతి రెండు, మూడు సంవత్సరాలకు స్కేల్ ఆఫ్ రిలీఫ్ ఖరారు చేస్తారు. ఈ క్రమంలో తాజాగా పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. పెరిగిన స్కేల్ ఆఫ్ రిలీఫ్ 2024 ఆగస్టు నుంచి వర్తిస్తుందని పేర్కొన్నారు.

- పాడి ఆవు లేదా గేదె చనిపోతే రూ.50 వేలు, ఎద్దుకు రూ.40 వేలు, దూడలకు రూ.25 వేలు, గొర్రెలు, మేకలకు రూ.7,500, ఒక్కో కోడికి రూ.100 ప్రకారం గరిష్టంగా రూ.10 వేలు, పశువుల పాక నష్టానికి రూ.5 వేల ప్రకారం పరిహారం వర్తింపజేశారు.
- మనిషి చనిపోతే రూ.5 లక్షలు, ఇళ్లు కూలినా, దెబ్బతిన్నా రూ. 10 వేలు, కిరాణా కొట్టుకు రూ.25 వేలు, రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ కలిగిన కుటీర పరిశ్రమలకు రూ.50 వేలు, రూ.1.50 కోట్ల లోపు టర్నోవర్ కలిగిన వాటికి రూ.లక్ష, రూ.ఒకటిన్నర కోట్లకు పైగా టర్నోవర్ కలిగిన వాటికి రూ.1.50 లక్షలు, ద్విచక్రవాహనాలకు రూ.3 వేలు, త్రిచక్ర వాహనాలకు రూ.10 వేలు, తోపుడు బండ్లకు రూ.20 వేలు, చేనేతలకు రూ.25 వేలు, పాక్షికంగా బోట్లు దెబ్బతింటే రూ.9 వేలు, వలలకు రూ.5 వేలు, బోట్లు, వలలు పూర్తిగా దెబ్బతింటే రూ.20 వేలు, మోటార్ బోట్లు, వలలు దెబ్బతింటే రూ.25 వేలు, చేపల చెరువుకు రూ.18 వేలు, పట్టు రైతులకు 25 వేలు ప్రకారం నష్ట ఉపశమనం వర్తింపజేస్తారు.
- వేరుశనగ, పత్తి, వరి, చెరకు హెక్టారుకు రూ.25 వేల ప్రకారం లెక్కకట్టి ఇస్తారు. సజ్జ, మినుము, పెసర, మొక్కజొన్న, రాగి, కంది, కుసుమ, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పొగాకు, ఆముదం, కొర్ర, సామ, జూట్ పంటలు హెక్టారుకు రూ.15 వేల ప్రకారం స్కేల్ ఆఫ్ రిలీఫ్ ఖరారు చేశారు.
- అరటి, మామిడి, దానిమ్మ, జామ, ఉసిరి, సపోటా, రేగు, డ్రాగన్‌ఫ్రూట్, జీడిపప్పు, కాఫీ, పసుపు, మిరప హెక్టారుకు రూ.35 వేలు, కళింగర, కర్బూజా, దోస, బొప్పాయి, టమాటా, పూలు, ఉల్లి, ధనియాలు, కూరగాయలకు రూ.25 వేలు, సెంటు విస్తీర్ణంలో ఉన్న ఆకుతోటలకు రూ.300 ప్రకారం గరిష్టంగా రూ.75 వేల వరకు ఇస్తారు. కర్రపెండలం రూ.10 వేలు, ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.1,500 ప్రకారం స్కేల్ ఆఫ్ రిలీఫ్ ఖరారు చేశారు.

భారీ పేలుళ్లతో బెంబేలు

- పుట్టపర్తిలో భయాందోళనకు గురైన ప్రజలు



పుట్టపర్తి సమీపంలో పేలుడు వల్ల ఎగిసి పడిన దుమ్ము

పుట్టపర్తి రూరల్: భారీ పేలుళ్లతో జిల్లా కేంద్రంలో మంగళవారం భూమి కంపించింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాలు.. ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, బీడుపల్లి గ్రామాల మీదుగా 342వ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న కొండలను చదును చేసే క్రమంలో కాంట్రాక్టరు పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు వినియోగిస్తున్నారు. మంగళవారం చేపట్టిన పేలుళ్ల ధాటికి ఆ ప్రాంతానికి సమీపంలో ఉన్న సత్యసాయి సూపర్ ఆస్పత్రి, సత్యసాయి ఎయిర్‌పోర్టు కార్యాలయం, జిల్లా కేంద్రంలోని అన్ని కార్యాలయాలతో పాటు వేలాది గృహ సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాలు కంపించాయి. ఆ సమయంలో భూకంపం వచ్చిందనే భయం అందరిలోనూ వ్యక్తమైంది. ఎనుములపల్లిలో శిల్పారామం, బీడుపల్లి, బ్రాహ్మణపల్లిలో గృహ సముదాయాల గోడలు బీటలు వారాయి. మోతాదుకు మించి మందుగుండు సామగ్రి వినియోగించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పుట్టపర్తి ప్రశాంతతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. జాతీయ రహదారి నిర్మాణం ఎంత అవసరమో... అంతకు మంచి ప్రజల భద్రత కూడా అవసరమని గుర్తించాలని కోరారు.

పరుగులు తీశాం



మంగళవారం ఉదయం అందరూ ఇంట్లోనే ఉన్నాం. ఆ సమయంలో ఇల్లు ఒక్కసారిగా కంపించింది. భూకంపం వచ్చిందనుకుని అందరమూ బయటకు పరుగు తీశాం. హైవే పనుల కోసం కొండలు పేల్చడంతో భూమి కంపించినట్లుగా తెలిసింది. పుట్టపర్తి ప్రశాంతతకు భంగం కలిగించేలా చేపట్టిన పేలుళ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చంద్రశేఖర్, బ్రాహ్మణపల్లి

గుండె ఆగినంత పనైంది



ఒక్కసారిగా భూమి కంపించడంతో గుండె ఆగినంత పనైంది. వృద్ధులు, గుండె జబ్బు బాధితులు ఇంతటి శబ్ద కాలుష్యాన్ని ఎలా భరిస్తారు. ఒక్కసారి పేలుడు సంభవిస్తే ఆకాశమంత ఎత్తుకు ధూళి ఎగిసి పడుతోంది. జాతీయ రహదారి అవసరమే... అయితే నిర్మాణంలో ఇలాంటి పేలుళ్లతో భయానక వాతావరణం సృష్టించడం సరికాదు.

– జగన్నాథ, ఎనుములపల్లి